క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడుకుందాం



అయిజ: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. ఉప్పల క్యాంప్ సమీపంలోని ఆర్డీఎస్ కాలువ పక్కన శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అన్ని గ్రామపంచాయతీల్లో నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9, 10 తేదీల్లో చేపట్టిన మహా పడావు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంతోపాటు దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దేశవ్యాప్తంగా రెండు రోజులపాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉప్పేరు నర్సింహ, రంగస్వామి తదితరులు ఉన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం




రాజోళి: ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పద్మశాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్థాపించిన తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘంలో అందరూ సభ్యత్వం తీసుకొని సంఘం బలోపేతానికి సహకరించాలని కోరారు. అనంతరం పలువురికి సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ వీరన్న, రామస్వామి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మానవపాడు: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాము, కళాజాత బృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, దివ్యవాణి సూచించారు. మండలంలోని నారాయణపురంలో శనివారం పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో కళాకారులు కృష్ణ, రంగప్ప, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, రమణ, గిరి, తిరుపాల్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు సహకరించాలి



గద్వాల క్రైం: డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు రవాణాశాఖ అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. శనివారం రవాణాశాఖ జిల్లా అధికారి పురుషోత్తంరెడ్డిని ఎమ్మెల్యే కలిసి మాట్లాడారు. యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందజేసేందుకుగానూ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి 25,200 దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన వారికి లైసెన్స్ జారీ చేసి మేళాను విజయవంతం కోరారు.

క్రమబద్ధీకరణ ఎప్పుడో..?



వడ్డేపల్లి ఎమ్మార్సీలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ స్రుజన

- సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ఎదురుచూపులు
- దాదాపు 15ఏళ్లుగా బోధన, బోధనేతర సిబ్బంది విధులు
- కనీస వేతన స్కేల్, ఉద్యోగ భద్రత, బీమాకు నోచుకోని వైనం
- చాలీచాలని వేతనాలతో సతమతం

శాంతినగర్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వరిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వారికి ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వకపోగా, ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలీచాలని వేతనాలతో ఒకవైపు కుటుంబాలను పోషించుకోలేక.. మరోవైపు ఉద్యోగాన్ని వదులుకోలేక సతమతమవుతున్నారు. 15ఏళ్లుగా సమగ్ర శిక్ష అభియాన్ కింద ఎమ్మార్సీ, కేజీబీవీలలో యూఆర్ఎస్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్కావెంజర్స్, కంప్యూటర్ టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యాశాఖలో కీలకంగా ఉంటూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వీరిని ప్రభుత్వం క్రమబద్ధీకరించకపోవడం వల్ల తక్కువ వేతనంతో పని చేస్తూ అవస్థలు పడుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బందికి పేస్కేల్ వర్తింపజేసి, ప్రమాదబీమా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

2009 నుంచి విధుల్లో..

సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది 2009 నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. మొదట కంప్యూటర్ ఆపరేటర్లు విధుల్లో చేరగా.. 2012 నవంబర్ 27న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్‌పీలు విధుల్లో చేరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అప్పట్లో రూ.5,500 నుంచి రూ.8,400 వరకు ప్రభుత్వం చెల్లించేదని చెబుతున్నారు. ప్రస్తుతం రూ.18,700 నుంచి రూ.19,500 వేతనం ఇస్తున్నట్లు తెలిపారు. సమాన పనికి సమాన వేతన చట్టం ప్రకారం రూ.35వేలు ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సిబ్బంది వాపోతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణ

ఒడిశా, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో బోధన, బోధనేతర సిబ్బందిని క్రమబద్ధీకరించినట్లు సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది తెలిపారు. తెలంగాణలోనూ రెగ్యులరైజ్ చేసి రూ.28వేల నుంచి రూ.35వేల వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

12ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాను. తమను క్రమబద్ధీకరిస్తారని ఎదురుచేస్తున్నాం. కనీస వేతనమైనా పెంచుతారని ఆశిస్తున్నాం. క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి. అంతేగాక ప్రమాద బీమాతోపాటు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలి

– స్రుజన, ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్, వడ్డేపల్లి

సమాన వేతనం ఇవ్వాలి



2012 నుంచి ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మొదట రూ.8,400 వేతనం ఇచ్చేవారు. 2015లో రూ.వెయ్యి పెంచారు. 30శాతం పీఆర్సీలో రూ.4,500 పెంచగా, ప్రస్తుతం రూ.19,500 వస్తున్నాయి. సీనియర్ అసిస్టెంట్లకు రూ.35వేలు ఇస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి న్యాయం చేయాలి.

– ఖాజాహుస్సేన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఇటిక్యాల

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని ప్రసిద్ధ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాలను తెల్లవారుజాము నుంచే భక్తులు సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, సవారి, సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్లను బాగు చేయకపోతే ఉద్యమిస్తాం



గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న రంజిత్‌కుమార్

ధరూరు: గ్రామీణ ప్రాంత రోడ్లను బాగు చేయకపోతే నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని జిల్లా చైర్మన్ గొంగ్లల రంజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని నెట్టెంపాడు–నీలహళ్లి గ్రామాల మధ్య గుంతలమయంగా మారిన రోడ్డును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఆపద వస్తే ఈ రోడ్డుపై ఎలా ప్రయాణించాలో అధికారులు, పాలకులు చెప్పాలన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే గ్రామాలు గుర్తుకు వస్తాయని, ఆ తర్వాత గ్రామాలను పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందన్నారు. రోడ్లకు మరమ్మతు చేయించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, వెంకట్రాములు, మండల అధ్యక్షుడు గోవిందు, ఆంజనేయులు, రాము, తిమ్మప్ప, విష్ణు, గోపాల్, ఎల్లప్ప, శివన్న, రమేష్, నర్సింహులు, ఎల్లేష్, వీరేష్, ఉరుకుందు, వీరన్న పాల్గొన్నారు.

పంటల పరిశీలన



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్, లింగన్వాయి గ్రామశివారులో సాగు చేసిన పంటలను శనివారం ఏఓ అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, మొక్కజొన్న పంటల్లో నీరు నిలువకుండా కాల్వలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తిపంటకు 30కిలోల యూరియా, 20కిలోల పొటాష్ చల్లాలని తెలిపారు. కందిపంట సాగుకు ముందు కిలో విత్తనాలకు మూడు గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మానస తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం



అలంపూర్ రూరల్: మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకొనే మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పీర్లచావిడిలో శుక్రవారం రాత్రి చిన్న ఇమాం ఖాసీం అలెక్బర్ పీరు ఏర్పాటు చేశారు. 10 రోజులపాటు పీర్ల ఉత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం రాత్రి గంధం, పెద్ద లాలీసాబ్, చిన్న లాలీసాబ్ పీర్లు కొలువుదీరాయి. 29న తుంగభద్ర నదిలో పీర్లను నిమజ్జనం చేయనున్నారు.

ఆర్థికసాయం అందజేత

గద్వాల అర్బన్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభకనబర్చి ఐఐటీలో సీటు సాధించిన ధరూరు మండలం కోతులగిద్దకు చెందిన మహేశ్వరికి శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ విద్యార్థులు రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శ్రీహరి, కిశోర్, జనార్దన్‌గౌడ్, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని నెట్టెంపాడుకు చెందిన రవి (40) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1997–98 బ్యాచ్ విద్యార్థులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

శుభ్రతతోనే వ్యాధులు దూరం



అలంపూర్ కేజీబీవీలో విద్యార్థినికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసూన రాణి



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూపరాణి

అలంపూర్ రూరల్: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరి చేరవని మండల వైద్యాధికారి ప్రసూన రాణి అన్నారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఎత్తు, బరువును పరిశీలించి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తర్ణాధికారి లక్ష్మీకాంత్, ఎస్ఓ కృష్ణవేణి, సిబ్బంది అక్కమ్మ, సురేఖ పాల్గొన్నారు.

మల్దకల్: బాలికలు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని, వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ విజయలక్ష్మి, అశ్విని, హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ పాల్గొన్నారు.

ఓటరు జాబితా బాధ్యత బీఎల్‌ఓలదే



వడ్డేపల్లిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి

శాంతినగర్: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే అని తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బీఎల్‌ఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా ఎన్నికల నిబంధనలు, బీఎల్‌ఓలు పాటించాల్సిన సూచనలను వివరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడంతోపాటు మరణించిన, డబుల్ ఓటర్లను తొలగించాలని తెలిపారు. జాబితాలో తప్పులను సవరించి పక్కాగా రూపొందించాలని సూచించారు. శిక్షణ అనంతరం బీఎల్‌ఓలకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ధరణి అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని ఉత్తనూరు ఉన్నత పాఠశాలలో శనివారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై మాస్టర్ ట్రైనర్ తిమ్మారెడ్డి అవగాహన కల్పించారు. ఫారం–6, 7, 8పై బీఎల్‌ఓలకు పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండాలని తెలిపారు. మృతి చెందిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. దివ్యాంగులు, 80 సంవత్సరాల వయస్సు పైబడిన వారిని గుర్తించి నమోదు చేయాలన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రం 2 కి.మీ. పరిధిలో ఉండాలన్నారు. ఒక పోలింగ్ బూత్‌లో 1500 మంది ఓటర్ల కంటే ఎక్కువ లేకుండా చూసుకోవాలని, ఒకే ఇంట్లో, వీధిలో ఉన్న వారి పేర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, మదన్మోహన్, నందిని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ నాయకుడికి గాయాలు

మల్దకల్: రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ నాయకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అమరవాయి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గట్టు మండలం మాచర్లకు చెందిన బీఆర్ఎస్ మైనార్టీసెల్ నాయకుడు ఎండీ అలీ జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, అమరవాయి స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడు, ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్ ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

హరిత లక్ష్యం సాధించాలి

మానవపాడు: హరితహారం లక్ష్యం మేరకు అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటి పెంచాలని ఎంపీడీఓ రమణారావు కోరారు. మండల కేంద్రంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను తవ్వించాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పారిశుధ్యం లోపించొద్దు

అలంపూర్ రూరల్: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఎంపీఓ చంద్రకళ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకుగానూ బ్లీచింగ్ పౌడర్, సున్నం వినియోగించాలని, మురుగు నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. శిథిల ఇళ్లల్లో నివసిస్తున్న వారిని పాఠశాలలు లేదా పంచాయతీ కార్యాలయాలకు తరలించి వసతి కల్పించాలని ఆదేశించారు.

23మంది బైండోవర్

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మందిని శనివారం తహసీల్దార్ సుందర్‌రాజ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్, ఎస్ఐ రాజేందర్ తెలిపారు. నిషేధిత సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీదారులను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని బెల్టుషాపులను తనిఖీ చేశారు.

చెట్లకొమ్మల తొలగింపు

మానవపాడు: మండలంలోని గోకులపాడులో విద్యుత్ లైన్లను అనుసరించి ఉన్న చెట్ల కొమ్మలను శనివారం గ్రామస్తులు తొలగించారు. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. విద్యుత్‌లైన్ల కింద చెట్లు ఏపుగా పెరిగినా పట్టించుకోవడంలేదని వాపోయారు. విద్యుత్ సమస్య ఏర్పడకుండా చెట్లకొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు.

గతుకుల రోడ్డుతో అవస్థలు



గట్టు: మండల కేంద్రంలోని రైతువేదిక నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇసుక, మట్టి టిప్పర్ల రాకపోకలతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతల్లోకి నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

కాలుష్యాన్ని నివారించాలి

శాంతినగర్ : ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ కోరారు. శనివారం వడ్డేపల్లి మండలంలోని రామాపురం–తిమ్మాజిపల్లి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. నాటే ప్రతి మొక్కనూ సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వేతనాలు పెంచాలి

శాంతినగర్: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డేపల్లిలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు శనివారం బీఎస్పీ నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామాల శుభ్రతకు అహర్నిశలు శ్రమించే కార్మికుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జలేందర్, యువరాజ్, నాగేష్, చరణ్, మధుపాల్గొన్నారు.

మల్దకల్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు వెంకటన్న, కిష్టన్న, గోపాల్ మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా సౌకర్యం కల్పించి కనీస వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సవారమ్మ, కిష్టమ్మ, సత్యన్న పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

గద్వాల క్రైం: ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. శనివారం మెలచెరువు రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మణిపూర్ దోషులను ఉరితీయాలి



అలంపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు

గద్వాల అర్బన్: మణిపూర్‌లో మహిళలపై అనాగరిక చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించి దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ, రామకృష్ణ, రఘు, పరశురాముడు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మణిపూర్‌లో మహిళలపై దాడికి పాల్పడి హతమార్చిన దోషులను ఉరితీయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాలు సులోచనమ్మ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను ఖండిస్తూ శనివారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, అడివమ్మ పాల్గొన్నారు.

శాంతినగర్: మణిపూర్ ఘటనను అందరూ ముక్త కంఠంతో ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. మతతత్వ శక్తుల దాడులను నిరసిస్తూ శాంతినగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామ్మోహన్, లాజర్, భూషణం, కేశవరావు, ఆశీర్వాదం, విజయ్, పరంజ్యోతి, మోహన్, కిశోర్, భీముడు, సూరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ : మణిపూర్ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ అన్నారు. మున్సిపాలిటీలోని గాంధీచౌక్‌లో సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేయడం దారుణమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు. మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, అయ్యప్ప, సిద్దయ్య, నూర్ అహ్మద్, షేక్షావలి, మాహబూబ్ బాషా, కృష్ణ, మద్దిలేటి, అఖిల్, దాసు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మణిపూర్ ఆడబిడ్డలకు బీఎస్పీ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు శాంతకుమార్ అన్నారు. మండలంలోని జల్లాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మణిపూర్ హింసపై మౌనం వహించిన ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి, రాజశేఖర్, సుంకన్న, లక్ష్మయ్య ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాల్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం ఇటిక్యాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువరాజ్, లక్ష్మణ్, నారాయణ, బుడ్డన్న, శేషన్‌కుమార్, తిమోతి, రాజ్‌కుమార్, దుబ్బన్న, ఎల్లయ్య, అనోక్ తదితరులు పాల్గొన్నారు.